ఎస్‌కెఎస్‌డిలో విద్యార్థి సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) వద్ద విద్యార్థి సంఘం ఎన్నికలు బుధవారం జరిగాయని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షురాలిగా డి.జయశ్రీ, కార్యదర్శిగా పి.విశ్వేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా కె.స్వప్న, పిజి ఎగ్జిక్యూటీవ్ సభ్యురాలుగా కె.సుమతి, జనరల్ కెప్టన్‌గా ఆర్. నేహామాధురి, కల్చరల్ సెక్రటరీగా ఆర్.గాయిత్రీసాత్విక ఎన్నికయ్యారని తెలిపారు. తమ విద్యార్థులు అన్నింటా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, విద్యార్థి సంఘం కన్వీనర్ యు.లక్ష్మీసుందరీ బాయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా సిఐటియు జిల్లా మహాసభ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గపూర్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో రెండు రోజులపాటు జరిగే సిఐటియు జిల్లా 12వ మహాసభ అంబేద్కర్ భవనంలో బుధవారం ఉత్సాహ భరితంగా ప్రారంభమయ్యాయి. రైస్‌మిల్ సీనియర్ కార్మికుడు గుబ్బల సత్యనారాయణ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. కార్మికుల ఐక్యతకు కృషి చేసిన అమరవీరులు అల్లూరు సత్యనారాయణ, మహమ్మద్ మీరా, పోతుల రామకృష్ణారావు, చవ్వాకుల సత్యం, మారుబోయిన సావిత్రమ్మ చిత్ర పటాలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గపూర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభా ప్రాంగణానికి మారుబోయిన సావిత్రమ్మ ప్రాంగణంగా నామకరణం చేశారు. ఆమెకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఆమె కుటుంబ సభ్యులు, నేతలు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఉన్న సమయంలో వామపక్ష భావాలతో ఉద్యమాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గపూర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరళీకరణ విధానాలంటూ ఎన్నో దశాబ్దాలుగా పోరాడి తెచ్చుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. 1991లో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండగా ప్రారంభమైన విధానాలు 31 ఏళ్లయినా ఎందుకు దేశంలో నిరుద్యోగం, పేదరిక నిర్మూలన

కార్మిక సమస్యలపైనే విస్తృత చర్చ

జరగలేదని ప్రశ్నించారు. పైగా పేదలపై పన్నుల భారం వేసి అదాని, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు రాయితీలిస్తున్నారని తెలిపారు. కరోనా సంక్షోభంలో చైనా, అమెరికా వంటి అనేక దేశాలు రూ.లక్ష వరకూ ప్రతి వ్యక్తికీ ఆర్థిక సహాయం చేస్తే మోడీ కేవలం బియ్యం, శనగలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జిల్లాలో జరిగిన కార్మికుల పోరాటాల గురించి జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ రంగాల కార్మిక నేతలు, మహిళ సంఘ నేతలు, ప్రతినిధులు, రాష్ట్ర సొసైటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పెన్మెత్స సత్యనారాయణ రాజు, బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం నేత సిహెచ్ పెద్దిరాజు, చింతకాయల బాబూరావు, వైట్ల రాణి, బి.జ్యోతి, రామకృష్ణ, పాలకొల్లు పట్టణ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న గుబ్బల సత్యనారాయణ

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి

మతోన్మాద బిజెపిని గద్దె దించేలా..

సామాజిక శక్తులు ఐక్యమవ్వాలి

కెవిపిఎస్ జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి

జెండాను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో తిరోగమన రాజకీయాలు చేస్తున్న బిజెపిని గద్దె దించేలా సామాజిక శక్తులన్నీ ఐక్యమవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. బుధవారం కెవిపిఎస్ పశ్చిమగోదావరి 5వ జిల్లా మహాసభ భీమవరం పట్టణంలోని అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో కూడిన నీలి పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులతో సభ జరిగింది. ఈ మహాసభలో అధ్యక్ష వర్గంగా జిల్లా అధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్, కానేటి బాలరాజు, బత్తుల విజయకుమార్, మినిట్స్ కమిటీగా జిల్లా నాయకులు ప్రసాద్, మాదాసి గోపి, చిన్నం చిన్న నాగేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నియంతృత్వ, నిరంకుశ విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కార్పొరేట్ల సేవలో మోడీ విహరిస్తున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన నరేంద్ర మోడీ ఇప్పుడు నిరుద్యోగ యువతను రోడ్డుపై పడేశారన్నారు. అంబానీ, ఆదానీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ దేశ ప్రజల్ని పేదరికంలోకి నెట్టిన ఘనత నరేంద్ర మోడీదే అని విమర్శించారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్‌ను వ్యతిరేకించే బిజెపి దళితులను వారి వైపు చేర్చుకోవడానికి ప్రస్తుతం అంబేద్కర్ జపం చేస్తున్నారన్నారు. అంబేద్కర్ పేరుజెప్పి దళితులను మోసం చేయలేరనే విషయాన్ని బిజెపి తెలుసుకోవాలన్నారు. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, పుచ్చలపల్లి సుందరయ్య, భగత్‌సింగ్ వంటి అనేకమంది సంఘ సంస్కర్తలు కుల వ్యవస్థపై ఉద్యమించాలని, వారి జీవితాన్ని దేశ ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఒకవైపు సమానత్వం కోసం దేశ ప్రజలందరూ ఐక్యంగా పోరాడుతుంటే మరోవైపు కులం, మతం వంటి భేదాలతో బిజెపి ప్రజల్ని విభజించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు రక్షణగా ఉన్న ఎస్‌సి ఎస్ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే 11 మంది దళిత వీరులు తన ప్రాణాలను త్యాగం చేసి ఆ చట్టాన్ని కాపాడుకున్నారని గుర్తు చేశారు. దళిత పేటల అభివృద్ధి కోసం రూపొందించిన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన చట్టాన్ని పూర్తిగా నిలిపివేసి దళితులపై తన వ్యతిరేకతను తెలియజేస్తుందన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై హత్యలు పెరగడం అంటే దేశ భవిష్యత్ ఆందోళన కలిగిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం దళితులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. దళిత ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి కేంద్రంలో బిజెపి విధానాలపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ దళితులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి కావడం కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిచారని గుర్తు చేశారు. అయితే నేడు బిజెపి ప్రభుత్వం సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఈ దేశంలో భూమి, సంపదను పంపిణీ చేయకుండా అభివృద్ధి జరగదన్నారు. అంబేద్కర్, పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలకు అనుగుణంగా కుల వ్యవస్థపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, కప్పల రత్నం రాజు, జి.శ్యాంబాబు, తణుకుల చంటి, వంగలపూడి కిషోర్, పి.శ్యాంబాబు, బాతు రామస్వామి, కింతాడ రమేష్ పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నాడు - నేడులో భాగంగా పాఠశాలలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో నాడు-నేడు పనులు, ఆధార్ అప్‌డేట్, గృహ నిర్మాణం, జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లు, అమూల్ పాల కేంద్రాల ప్రారంభంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించి ప్రణాళికబద్ధంగా పనులను పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు కింద చేపట్టిన పనులకు సంబంధించి పాఠశాలలు, కళాశాలలో ఏయే నిర్మాణాలు చేపడుతున్నారో అన్ని పనులు ఒకేసారి జరగాలని ఆమె ఆదేశించారు. అదనపు గదుల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, తాగునీరు తదితర పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాడు - నేడు పనులకు ఇసుక కొరత లేదని, అన్ని పనులూ ఒకేసారి ప్రారంభించి కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును విధిగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్డేషన్ క్యాంప్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రతి శనివారమూ గృహ నిర్మాణాలకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్స్‌తో సమావేశం నిర్వహించి గృహ నిర్మాణానికి సంబంధించిన అధికారులతో చర్చించి ఏమైనా సమస్యలుంటే వాటిని అక్కడే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్‌వి.రమణ, సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల రావు, డ్వామా పీడీ రాజేశ్వరరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు

రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాపరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆహారం అందించడం పేద, బలహీన వర్గాలకు కల్పించిన హక్కు అని, అది ఉచితం కాదని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి ఆహార భద్రతా చట్టంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం రుచికరంగా వండి పిల్లలు, విద్యార్థులకు అందించకపోతే వారి శారీరక, మానసిక ఎదుగుదల లోపాలకు సంబంధిత అధికారులే కారణంగా ఉంటారనేది గ్రహించాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి పేద, బలహీన వర్గాల విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా ఉండి వసతి గృహాల్లో చదువుకోడానికి వస్తారని, అటువంటి వారికి తల్లిదండ్రుల వలే మంచి భోజనం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 439 పర్యటనలు చేశామని, చాలా ఫిర్యాదులు అందాయని తెలిపారు. తొలి విడత సందర్శనలో హెచ్చరికలు మాత్రమే చేయడం జరుగుతుందని, మలి విడత సందర్శన నాటికి తప్పులు సరిదిద్దుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల సందర్శించిన ఓ వసతి గృహంలో రసం నీళ్ల మాదిరిగానే ఉందని, ఇటువంటి పరిస్థితి నుంచి మారాలని సూచించారు. విద్యార్థుల హాజరు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. హాజరులో తేడాలొస్తే అంగన్‌వాడీ సూపర్‌వైజర్లపై చర్యలు తప్పవన్నారు. ఫార్టిఫైడ్ రైస్‌లో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 వంటి పోషకాలు ఉంటాయని, ఈ విషయంపై భోజనం తయారు చేసే వారిలో అవగాహన లేదన్నారు. బియ్యం కడిగేటప్పుడు పైకి తేలిన బియ్యాన్ని తీసేసి వండుతున్నారని, పైకి తేలిన తేలిగ్గా ఉన్న బియ్యమే ఫార్టిఫైడ్ రైస్ అని గ్రహించాలన్నారు. మంగళవారం జిల్లాలో యలమంచిలి, ఉండి, భీమవరం మండలాల్లోని పలు ఎఫ్‌పి షాపులు, ఎంఎల్‌ఎస్ పాయింట్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేశామన్నారు. ఆహార కమిషన్ మెంబర్ జె.కృష్ణ కిరణ్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందించాలనే ఉద్దేశంతో జిల్లాలోని 204 మిల్లుల్లో సార్టెక్స్ మిషన్లను మార్పు చేయడం జరిగిందన్నారు. పేదలకు అందిస్తున్న బియ్యంపై చిన్న చూపువద్దని అవి చాలా నాణ్యమైనవి అన్నారు. ఈ సమావేశంలో ఆహార భద్రత శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరాం ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఇఒ ఆర్‌వి.రమణ పాల్గొన్నారు.

ఆకివీడు : తమ శాఖకు చెందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో సమస్య ఏర్పడితే టోల్ ఫ్రీ నెంబర్ 155235కు ఫోన్ చేసి సమస్యల గురించి చర్చించవచ్చని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ ప్రతాప రెడ్డి చెప్పినట్లు సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపారు. బుధవారం భీమవరం డిఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో ప్రతాపరెడ్డిని కలిసి పలు అంశాల గురించి చర్చించినట్లు బంగారయ్య తెలిపారు. పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పథకాల గురించి చర్చించినట్లు చెప్పారు. రేషన్ సరుకుల పంపిణీ, అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, మధ్యాహ్న భోజనం, ప్రధాని మాతృ యోజన పథకంలో తొలి కానుపు మహిళకు 5000 ఇచ్చే పథకం గురించి చర్చించినట్లు బంగారయ్య విలేకరులకు వివరించారు. అనంతరం కమిషన్ ప్రతాపరెడ్డిని బంగారయ్య సత్కరించారు.

విద్యార్థులకు సంతృప్తికర భోజనం అందించాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యార్థులు సంతృప్తిపడేలా మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని భవిత వికలాంగుల పాఠశాల, పురపాలక ఎలిమెంటరీ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించి, భోజనాన్ని ఆమె రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. భోజనం నిర్వహణలో నాణ్యతలోపించినట్లు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బియ్యం, నిత్యావసర వస్తువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ వైపిఒ శ్యామ్ సుందర్, తహశీల్దార్ జి.మమ్మీ, మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్‌కుమార్, ఇఒపిఆర్‌డి షరీఫ్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని పూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాడు - నేడు పనులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నాడు-నేడు పనులు చేపట్టే ముందుగానే స్కూల్ ప్లాన్ గీయించి నోటీసు బోర్డులో ఉంచడంతోపాటు, ఏ ప్రదేశంలో ఏ పని చేపట్టాలో ప్రణాళిక బద్ధంగా ఉండాలన్నారు. పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు కలిసి పనులు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పని జరిగే ప్రదేశాలకు పిల్లలు వెళ్లకుండా రెడ్ టేపు కట్టించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యమైంది అందించాన్నారు. అనంతరం మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌వైపిఒ శ్యామ్ సుందర్, తహశీల్దార్ మమ్మీ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం జిల్లాలోని అన్ని రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టర్ ఛాంబర్ వద్ద జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోలు సెంటర్లలో లోటుపాట్లను గమనించామన్నారు. సొసైటీలు ఏర్పాటు చేసుకున్న పిపిసి ఏజెన్సీ ప్రెసిడెంట్స్ ఆర్‌బికెల్లో అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కోపరేటివ్ అధికారిని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లకు విధులు కేటాయించడంతోపాటు, అసిస్టెంట్ రిజిస్టర్లు ఆర్‌బికెలను తరచూ సందర్శించేలా చూడాలన్నారు. తొలి విడతలో 34 ఆర్‌బికెల్లో పిపిసి సెంటర్లను వినియోగంలోకి తీసుకురాగా, నేటికీ వాటి సంఖ్య 67గా ఉన్నాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 153 రైస్ మిల్లుల్లో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, మిగిలిన రైస్ మిల్లుల్లో కూడా వెంటనే ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి ప్రతిరోజు డేటాను పరిశీలించేందుకు సమర్పించాలన్నారు. జిల్లాలో ఉన్న 296 ఆర్‌బికెల్లో సుమారు 400 తేమశాతం కొలిచే యంత్రాలను సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాంక్ గ్యారంటీలను త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓను ఆదేశించారు. జిల్లాలోని ఆర్‌బికెల్లో ఏ యే తేదీల్లో ధాన్యం కొనుగోలు జరుగుతుందో షెడ్యూల్ రూపొందించి ముందుగానే రైతులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డిఎంటి శివరాం ప్రసాద్, డీఎస్‌ఓ ఎన్.సరోజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంఎల్‌ఎ

మహిళతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వం చేస్తుందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం బాలేపల్లిలో రెండో రోజు కొనసాగింది. ఎంఎల్‌ఎ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి తమకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చిన సమస్యలను అధికారులతో అక్కడే పరిష్కారం చూపుతున్నారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ కరోనా వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వెనకాడలేదన్నారు. మేజర్, మైనర్ పంచాయతీలు అనే తేడా లేకుండా అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, చికిలే మంగతాయారు, గూడూరి ఓంకారం, గొలగాని సత్యనారాయణ, కొల్ల ఓంకారం పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : తిళ్లపూడి గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు నవరత్నాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం టిడిపి నాయకులు కడలి నరసింహారావు, గుబ్బల శ్రీనుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలోనే మరిన్ని వలసలు టిడిపి నుంచి వస్తాయని తెలియజేశారు. అనంతరం తిళ్లపూడి గ్రామ లబ్ధిదారులు 41 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, ఏడుకొండలు, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజు నాయుడు, మండల కన్వీనర్ మైఖేల్ రాజు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు స్వర్ణాంధ్ర విద్యార్థి

ప్రజాశక్తి- నరసాపురం టౌన్

ఈ నెల 12, 13వ తేదీల్లో కాకినాడ జెఎన్‌టియు ప్రాంగణంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పెమ్మాడి రాజేష్ ఎంపికైనట్లు స్వర్ణాంధ్ర కళాశాల ఛైర్మన్ కె.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకూ జైన్ యూనివర్సిటీ బెంగళూరు జరిగే పోటీల్లో కూడా జెఎన్‌టియు తరుపున తమ కళాశాలకు చెందిన విద్యార్థి పాల్గొనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి. పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, పండరీనాథ్ అభినందించారు.

ఎంపికైన విద్యార్థితో కళాశాల యాజమాన్యం

రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ కె.కార్తీక్

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన చికిత్స

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్స అందుతుందని మార్టేరు పిహెచ్‌సి డాక్టర్ కె.కార్తీక్ అన్నారు. బుధవారం మార్టేరు పిహెచ్‌సి పరిధిలోని పెనుగొండ జిల్లమ్మ చెరువులో ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 104 వైద్య సేవల ద్వారా మెరుగైన చికిత్స చేయించుకోవచ్చన్నారు. ఈ వైద్య శిబిరంలో 98 ఓపిలకు చికిత్స చేసి మందులు అందిస్తామని తెలిపారు. మంచానికి పరిమితమైన వారికి, అంగన్వాడీ చిన్నారులకు, ప్రయిమరీ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సూపర్‌వైజర్ కమలమ్మ, ఎంఎల్‌హెచ్‌పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - తణుకు రూరల్

పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా వంటి విభజన హామీలు అమలు చేయకుండా అడుగడుగునా రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. బుధవారం తణుకు నరేంద్ర సెంటర్లో రాష్ట్ర విభజన హామీలు అమలు కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ గతంలో బిజెపిని తీవ్రంగా విమర్శించిన పవన్, మోదీతో సమావేశం అనంతరం ఎందుకు సైలెంట్ అయ్యారన్నారు. ప్రత్యేక హోదా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దిర్సిపో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి, జనసేన, టిడిపి రాష్ట్ర ప్రయోజనాలను మోడీకి తాకట్టుపెడుతున్నాయన్నారు. నిరసనలో సిపిఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంఎల్‌ఎ చేయూత

ప్రజాశక్తి - పోడూరు

ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన వేడంగి గ్రామానికి చెందిన రావి రామకృష్ణను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు బుధవారం పరామర్శించారు. అనంతరం ధర్మారావు ఫౌండేషన్ ద్వారా నిత్యావసర వస్తువులు, సరుకులు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వారానికి రెండు రోజులు హోమియో వైద్యం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కవిటం మహిళా సంఘం భవనం వద్ద పరకాల ట్రస్ట్, గ్రామ మహిళా సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ పరకాల రమణారావు స్మారక హోమియోపతి హాస్పటల్ వద్ద వారానికి ఒకరోజు అందిస్తున్న ఉచిత హోమియో వైద్య సేవలను ఇక నుంచి వారానికి రెండు రోజులపాటు అందించేందుకు ఏర్పాటు చేశామని పరకాల ట్రస్ట్ అధ్యక్షుడు పరకాల సూర్య మోహన్ తెలిపారు. ప్రతి బుధవారమూ మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకూ డాక్టర్ ఆర్.పావని మాణిక్యం, శనివారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకూ డాక్టర్ కె.జనార్ధన్‌రావు వైద్య సేవలందిస్తారని తెలిపారు. కవిటం పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎంపికైన విద్యార్థులు

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికను శృంగవృక్షం ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాలకు చెందిన 360 మంది బాల బాలికలు పాల్గొన్నట్లు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి బి.జాన్సన్ తెలిపారు. 14 సంవత్సరాల విభాగంలో నిర్వహించిన ఈ ఎంపికలో వివిధ మండలాలకు చెందిన మొత్తం 32 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కాశీ జగన్నాథం, జిల్లా పిఇటి అసోసియేషన్ కార్యదర్శి ఎండి కుద్దూస్, వ్యాయామ ఉపాధ్యాయులు టిఎస్ఎన్ మల్లేశ్వరరావు, గంగా మహేష్ నాయుడు, ఆర్.రామకృష్ణ, సుధాకర్, రాజేంద్ర పాల్గొన్నారు.

లెప్రసీపై ఇంటింటా సర్వే చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రతి సచివాలయంలో ఉన్న ఆశాలు, ఎఎన్ఎంలు, వాలంటీర్లు లెప్రసీ వ్యాధిపై ప్రతిరోజు ఇంటింటి సర్వే చేసి వ్యాది ఉన్న వారిని గుర్తించాలని డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ సూచించారు. మచ్చలగలవారిని, స్పర్శలేని రాగి రంగు మచ్చలు ఉన్నవారిని, చెమట పట్టకపోవుటం తదితర లక్షణాలు ఉంటే అనుమానిత లెప్రసీగా గుర్తించి పరీక్ష చేసి ఆరు నెలల చికిత్స ఉచితంగా అందించనున్నట్లు డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమానిత మచ్చలు ఉన్నా వెంటనే ఆశాలకు, ఎఎన్ఎంలకు తెలియజేసి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం డిసెంబర్ ఐదో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ జక్కంపూడి రాంప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వరరావ్, పి.ఎలిజిబెత్, వై.నారాయణమూర్తి, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, ఎఎన్ఎం రోజా కమల, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు రూ.11.95 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయానికి రూ.11,95,615 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. అమ్మవారికి గత 55 రోజులుగా యాత్రికులు కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించుకున్న హుండీ ఆదాయాన్నియనమదుర్రులోని శక్తీశ్వర ఆలయ కార్యనిర్వాహణాధికారి కర్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఏ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు రాజమండ్రి భజన సమాజం సభ్యులు, అత్తిలి మండలం అరవవెల్లికి చెందిన శ్రీరామ భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పసర్లెక్కిన లక్ష్మణేశ్వరం కుళాయి చెరువు!

4 ఫిల్టర్ బెడ్‌లలో రెండే పనిచేస్తున్న వైనం
కలుషిత నీరు సరఫరా
ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

తీర ప్రాంత గ్రామాలకు తాగు నీరందించే లక్ష్మణేశ్వరం కుళాయి చెరువు నీరు పసర్లుకక్కుతోంది. సుమారు 9 గ్రామ పంచాయతీలకు ఈ కుళాయి చెరువు ద్వారానే తాగునీరు అందుతోంది. రాజుల్లంక, దర్భరేవు, మర్రితిప్ప, సారవ, మోడి, ఎల్‌బిచర్ల, లక్ష్మణేశ్వరం, వైఎస్ పాలెం, రామన్నపాలెం తదితర గ్రామాల ప్రజలకు ఈ చెరువు ద్వారానే నీరు సరఫరా అవుతోంది. ఇంతటి ప్రాముఖ్యతున్న ఈ చెరువు నీరు పసర్లెక్కి అధ్వానంగా తయారైంది. ఆ నీటినే తాగాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువులో నీటిని నింపేందుకు వాడే వేములదీవి ఛానెల్ పంట కాలువ కూడా పూర్తిగా కలుషితమవుతోంది. నర్సాపురం నుంచి వచ్చే వేములదీవి ఛానెల్ ఈ కాలువలో మున్సిపల్ వ్యర్థాలు, ప్రభుత్వాసుపత్రి వ్యర్థాలు, చేపల మార్కెట్ వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో కాలువలో చెత్త పేరుకుపోయి కలుషితమవుతోంది. ఈ విషయమై అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేశామని, వారు నేరుగా పరిశీలించిన దాఖలాలు కూడా ఉన్నాయని గ్రామస్తులు చెపుతున్నారు. అయితే సమస్య మాత్రం పరిష్కారం కాలేదని విమర్శించారు. దీంతో చేసేది లేక కలుషిత నీటినే తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఈ చెరువులో నీటిని శుభ్రం చేసేందుకు 4 ఫిల్టర్ బెడ్‌లను వినియోగిస్తున్నారు. ఈ నాలిగింటిలో 2 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా రెండు మరమ్మతులకు గురవ్వడంతో నీరు సరిగ్గా శుద్ధికావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ గడ్డి ఏపుగా పెరగడంతో పాముల బెడద ఎక్కువుగా ఉంటోందని ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేసి పరిశుభ్రమైన నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పసరుగా లక్ష్మణేశ్వరం కుళాయి చెరువు నీరు

చెరువు గట్టును బాగు చేయాలి

యాండ్ర బాబూరావు, లక్ష్మణేశ్వరం

గ్రామంలో కుళాయి చెరువు చుట్టూ గడ్డి ఏపుగా పెరిగి అధ్వానంగా తయారైంది. చుట్టు పక్కల వారు చెత్తా చెదారాలను కుళాయి చెరువు పక్కనే పడేస్తున్నారు. దీంతో చెరువు ప్రాంతం అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి చెరువు గట్టును బాగు చేసి స్వచ్ఛమైన నీటిని అందించాలి.

చర్యలు చేపడతాం..

యు. రవిరాజా, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ

చెరువును నింపేందుకు వాడుతున్న పంట కాలువ నీరు కలుషితమవుతున్న మాట వాస్తవమే. ఈ సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లాం. తాగునీరు పసర్లెకుతున్న విషయాన్ని గమనించి చర్యలు చేపడతాం. మరమ్మతులకు గురైన ఫిల్టర్ బెడ్లను బాగుచేసి 4 ఫిల్టర్ బెడ్‌లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తాం.

నేడు నత్తరామేశ్వరంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నత్త రామేశ్వరంలో ఈ నెల 17వ తేదీ గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పూర్ణబాబ్జి బుధవారం తెలిపారు. స్థానిక సర్పంచి వెలగల ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
I.A. No. 462/2019 in O.S. No. 466/2019
బిట్వీన్:
శ్రీమతి కంచెర్ల మాధవి -పిటీషనరు/వాది
మరియు
1. గూడూరు శ్రావణ్‌కుమార్
2. కంచెర్ల మాధవరావు
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పై నెంబరు గ్రంధమును పిటీషనరు/ వాది గారు రెస్పాండెంట్లు/ ప్రతివాదులపై ఇంజక్షన్ ఆర్డరు ఇప్పించమని దాఖలు చేసియున్నారు. దానిపై రెండవ రెస్పాండెంటు అయిన శ్రీ కంచెర్ల మాధవరావు, S/o. లేటు గంగాధరరావు, D.No. 17-60, NTR కాలనీ, వెంకటాపురం, ఏలూరు అను వారికి ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల **ది. 07-12-2022వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

సం/- **అంబుల వెంకటనారాయణ**
న్యాయవాది, పత్తేబాద
ఏలూరు ఏలూరు
తేది:16-11-2022 సెల్: 9848422155

విద్యార్థులు పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

విద్యార్థులు పరిశ్రమలు స్థాపించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా అభివృద్ధి చెందాలని ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ సౌత్ ఇండియా కన్వీనర్ కలవకొలను తులసీరావు తెలిపారు. బుధవారం నరసాపురం వైఎన్ కళాశాల ఎంబిఎ విద్యార్థులు, ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎంబిఎ విద్యార్థులు నరసాపురం లేస్ ట్రేడ్ సెంటర్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న లేస్ అల్లికలను పరిశీలించారు. లేస్ ఉత్పత్తులకు ముడిసరుకు ఎలా అందుతుంది, ఉత్పత్తి ఏ విధంగా జరుగుతుందనే వివరాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో తులసీరావు మాట్లాడుతూ లేస్ ఉత్పత్తులకు ఇతర దేశాల్లో ఉన్న డిమాండ్, ఎగుమతి, లేసు అల్లికలు స్త్రీలకు ఇచ్చే శిక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు పట్టణంలోని రుస్తుంబాదలో ఉన్న టాయ్ సిటీని కూడా సందర్శించి పరిశ్రమ పనితీరును పరిశీలించారు. ఈ సదస్సులో వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు, ఆర్‌వి.సుబ్బారావు, ఆర్.పార్థసారధి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
O.S. No. 466/2019
బిట్వీన్:
శ్రీమతి కంచెర్ల మాధవి -వాది
మరియు
1. గూడూరు శ్రావణ్‌కుమార్
2. కంచెర్ల మాధవరావు -ప్రతివాదులు

పై నెంబరు గ్రంధమును వాది గారు ప్రతివాదులపై షెడ్యూలు ఆస్తికి ఓనర్‌గా డిక్లేర్ చేయమని మరియు సదరు ఆస్తిని వాది గారికి అప్పగించమని కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై 2వ ప్రతివాది అయిన శ్రీ కంచెర్ల మాధవరావు, S/o. లేటు గంగాధరరావు, D.No. 17-60, NTR కాలనీ, వెంకటాపురం, ఏలూరు అను వారికి ఏవిధమైన ఆక్షేపణలు ఉన్న యెడల **ది. 07-12-2022వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

సం/- **అంబుల వెంకటనారాయణ**
న్యాయవాది, పత్తేబాద
ఏలూరు ఏలూరు
తేది:16-11-2022 సెల్: 9848422155

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో 75 వసంతాల స్వాతంత్ర్య భారత ప్రగతి అంశంపై కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. గోయెంకా మహిళా కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సాల్మన్ రాజు, గారికిపాటి బాపయ్య శర్మ, కర్రి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉండి: ధూమపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ కెసిహెచ్ వీర్రాజు అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉండి శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు గ్రంథాలయ అధికారి జెవి కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధూమపానం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఏలూరు ప్రభుత్వాసుపత్రి సైకాలజిస్ట్ వీర్రాజు పాల్గొని మాట్లాడారు. ధూమపానం, మాదకద్రవ్యాల వల్ల యవ్వనంలోనే శరీరంలోని అంతర్భాగాలు దెబ్బతింటాయన్నారు. యువత చెడువ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సేవకులు జి.బాల, శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ఖండాపు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరు : జిన్నూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాల విద్యార్థులకు నీతి కథల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మంది విద్యార్థులు పాల్గొని నీతి కథలు చెప్పారు. ఉపాధ్యాయులు వారణాసి శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు న్యాయానిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ పాతూరి నాగభూషణం చిత్రపటాలకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దండు కృష్ణంరాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారి జీవిత విశేషాలు అభివృద్ధి కమిటీ కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకురాలు భత్తుల జోగారత్నం, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోడూరు : విద్యార్థులకు బహుమతులు అందజేసిన సిబ్బంది

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & First Floors, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A.No. 196 OF 2021

Between
The Karur Vysya Bank Ltd, Rep by its Branch Manager Gannavaram Branch, Krishna District of A.P ... **APPLICANT BANK**
And
1. Kolapala Prudhvi, S/o Ranga Rao, Door No 8-195, Raitupata Nanadigama 521 185, Krishna District.
2.Battula Raj Kumar, S/o Kondaiah, House No13-69, Vidyanagar Gavaravaram, Senivarapupet, Eluru 534003, West Godavari District.
...**DEFENDANTS**

SUMMONS

Whereas the Applicant Bank had instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of amount as mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file your written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **09-12-2022** to answer the claim.

If you intend to file any documents, you may file the same with a list along with the written statements.

You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.

Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 9th day of November, 2022

Signature of the Officer
Authorized to issue summons

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : చెరుకువాడ

ప్రజాశక్తి - పెనుగొండ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని దేవ తాళ్లపాలెంలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. దేవ తాళ్లపాలెంలో రూ.15 లక్షలతో వంతెన నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్‌సి కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నల్లూరి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, ఎంపిపి పాలపర్తి సుబ్రహ్మణ్యం వి.శ్రీనివాస్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు

మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం

ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
పది సెల్‌ఫోన్లు, రూ.96 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం టూ టౌన్ పరిధిలో మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం చేస్తున్న నలుగురు మహిళలను, ముగ్గురు పురుషులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో భీమవరం టూ టౌన్ సిఐ బి.కృష్ణకుమార్ వివరాలు వెల్లడించారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఆకుల రఘుకు వచ్చిన సమాచారం మేరకు జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ ఆదేశాల మేరకు భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఈ దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచారం చేస్తున్న ఇంగువ శివ సురేష్, సత్యదేవ్, ప్రతాప్, మాంధతి మాధవ్, గడ్డం వినోద్ కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది సెల్ ఫోన్లు, రూ.96,130 నగదు, 20 కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వ్యభిచారం కోసం తీసుకొచ్చిన నలుగురు మహిళలను నిందితుల బారి నుండి రక్షించినట్లు తెలిపారు. మసాజ్ సెంటర్ పేరుతో మహిళలతో వ్యభిచారం చేయించి అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు రాంబాబు, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు తెలుపుతున్న పోలీసులు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, ఏలూరు
Tr. O.P. 18/2021
Between:
Nerella Venkata Koteswara Rao ...*Petitioner*
AND
Nerella Venkata Koteswara Rao & Others ...*Respondents*

పై నెంబరు పిటిషన్‌లో 5వ రెస్పాండెంట్ అయిన Parachuri Padmavathi, W/o. Ranga Mohan Babu, D.No. 18-9-95, Siddi Vinayaka Home Needs, Near Brahmayya Hospital, Bheemeswara Swamy Temple Road, Bhimavaram అనువారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిన పుచ్చుకొననందున ఈ పేపరు ప్రకటన ద్వారా Substitute Service ద్వారా నోటీసు ఆర్డరు వేయుచూ **వాయిదా 02-12-2022వ తేదీకి వేసినారు. వాయిదా రోజు ఉదయం 10.30 ని||లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడును.

D.S.V.MANIKYALA RAO
Advocate, Eluru
Cell: 9440111466

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & First Floors, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A.No. 197 OF 2021

Between
The Karur Vysya Bank Ltd, Rep by its Branch Manager Gannavaram Branch, Krishna District of A.P ... **APPLICANT**
And
1.Bochela Venkateswara Rao, S/o Satyanarayana Murthy, Door No 35-22-12, Bank Colony, Ward No 30, Tanuku- 534211, West Godavari District.
2.Tatapudi Koteswara Rao, S/o Sanyasa Rao, Door No 16B-10-18/ 1, 29th Division, Near Old Ramalayam, Lankapeta, Eluru 534005, West Godavari District.
3.Bochela Nageswara Rao, S/o Venkateswara Rao, Door No 1, Library Street, Bank Colony, Tanuku 534211, West Godavari District... **DEFENDANTS**

SUMMONS

Whereas the Applicant Bank had instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of amount as mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file your written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **09-12-2022** to answer the claim.

If you intend to file any documents, you may file the same with a list along with the written statements.

You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.

Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 9th day of November, 2022

Signature of the Officer
Authorized to issue summons